

అధికార దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - దేవరపల్లి

అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న హోం మంత్రి తానేటి వనితపై చర్యలు తీసుకోవాలని సిపిఎం సీనియర్ నాయకులు ఉండవల్లి కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గోపాలపురం నియోజకవర్గంలో ఉన్న అంగన్‌వాడీలు, ఆశాలు, యానిమేటర్లను సమావేశ పరుస్తూ ప్రలోభ పెట్టడం అధికార దుర్వినియోగమేనన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో ఇటువంటి సమ్మేళనాలు నిర్వహించడం, సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తుండటాన్ని ఆయన తప్పుబట్టారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. స్కీం వర్కర్లతో సమావేశం నిర్వహించడం, అనధికార వ్యక్తులు వేదికపై ఉండటం అభ్యంతరకరమన్నారు. కలెక్టర్ వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

ఏ సీటు ఎవరికి..?

కొలిక్కి వచ్చిన కూటమి సర్దుబాట్లు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్రంలోనే అత్యధిక శాసనసభ స్థానాలు కలిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విపక్ష కూటమి సీట్ల సర్దుబాటు పూర్తయింది. ఏ స్థానంలో ఏ పార్టీ బరిలో ఉండాలనే దానిపై పంపకాలు కూడా చేసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి మూడింట రెండొంతుల స్థానాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో బరిలో దిగబోతోంది. మొత్తం 21 స్థానాలకు 15 స్థానాల్లో ఆ పార్టీ పోటీ చేస్తుంది. మిగిలిన ఆరు స్థానాలకు 5 చోట్ల జనసేన అభ్యర్థులు, ఒకచోట బిజెపి బరిలో ఉంటాయి.

2014 ఎన్నికల్లో బిజెపి గెలిచిన రాజమహేంద్రవరం అర్బన్‌కు మరోసారి ఆ పార్టీ అభ్యర్థి పోటీ చేయబోతున్నారు. బిజెపి సీనియర్ నేత, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే బిజెపి అధిష్ఠానం నుంచి ఆయనకు సంకేతాలు వచ్చినట్లు చెబుతున్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటు సీటు కూడా బిజెపి ఖాతాలో పడడంతో ఎంపీ స్థానం పరిధిలో ఒక అసెంబ్లీ సీటుకి బిజెపి బరిలో ఉండేందుకు అంతా సిద్ధం చేసుకున్నారు. అందుకు అనుగుణంగా రాజమహేంద్రవరం అర్బన్ సీటును బిజెపి తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇక జనసేనకు ఐదు స్థానాలు దక్కాయి. మూడు పార్టీల కీలక నేతలు అమరావతిలో జరిపిన చర్చల తర్వాత ఎవరు ఎక్కడ బరిలో ఉండాలన్న దానిపై తాజాగా స్పష్టత వచ్చింది. దానికి తగ్గట్టుగా నియోజకవర్గాల్లో నేతలకు కూడా సమాచారం అందిస్తున్నారు. దాన్ని బట్టి జిల్లాలో ఇప్పటికే ప్రకటించిన రాజానగరం, కాకినాడ రూరల్ స్థానాలతో పాటుగా జనసేన సిట్టింగ్ సీటు రాజోలులో కూడా ఆ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారు. ఈ మూడు స్థానాలతో పాటు అమలాపురం, పిఠాపురం, రామచంద్రపురం స్థానాల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థులు బరిలో ఉండే అవకాశం కనిపిస్తుంది. రామచంద్రపురం స్థానం కోసం టిడిపి కూడా పట్టుబడుతుంది. ఈ జిల్లాలో ఒక సీటు కేటాయించడం అనివార్యం కావడంతో టిడిపి ఆ స్థానం కోసం గట్టిగానే ప్రయత్నిస్తుంది. అదే జరిగితే జిల్లాలో మరొక స్థానం జనసేనకు దక్కుతుందా లేక ఐదు సీట్లతో సరి పెట్టుకోవాల్సి వస్తుందా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

ఇక జనసేన బిజెపికి కలిపి ఆరు లేదా ఏడు స్థానాలు ఖాయం కావడంతో మిగిలిన 14 లేదా 15 సీట్లలో టిడిపి అభ్యర్థులు పోటీలో ఉంటారు. ఇప్పటికే తుని, జగ్గంపేట, పెద్దాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, మండపేట, అనపర్తి, రాజమహేంద్రవరం సిటీ స్థానాల్లో అభ్యర్థులను టిడిపి ఖరారు చేసింది. అయితే రాజమహేంద్రవరం సిటీ స్థానాన్ని ఇప్పటికే సిట్టింగ్ ఎంఎల్ఎ భర్త ఆదిరెడ్డి వాసుకు ఖరారు చేసింది. ఆయన ఇప్పటికే ప్రచారంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ సీటును బిజెపికి కేటాయిస్తారా లేదా? అనేది సందిగ్ధంలో ఉంది. కాకినాడ సిటీ విషయంలోనూ టిడిపి భారీగా కసరత్తు చేస్తుంది. జిల్లాలో ఒక్క సీట్ అయినా మత్స్యకారులకు కేటాయించాలన్న అవకాశం ఉండడంతో మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేరు ఖరారు చేసే అవకాశం ఎక్కువ ఉంది. పి.గన్నవరం అసెంబ్లీ సీటును మహాసేన రాజేష్‌కి కేటాయించినప్పటికీ రాజకీయంగా ఎదురైన సవాళ్లతో ఆయనను ఉపసంహరించాల్సి వచ్చింది. ఇక కందుల దుర్గేష్ నిడదవోలు కేటాయించడంతో రాజమహేంద్రవరం రూరల్ స్థానంలో టిడిపి తరఫున గోరంట్ల బుచ్చయ్య చౌదరికి సీటు ఖరారైంది.

టిడిపి లిస్టులో 8 స్థానాలకు అభ్యర్థులకు లైన్ క్లియర్ అయ్యింది. మిగిలిన ఆరు లేదా ఏడు సీట్లలో ఎవరికి అవకాశం వస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. అందులో ప్రత్తిపాడు, కాకినాడ సిటీ, రామచంద్రపురం, పి.గన్నవరం, గోపాలపురం, కొవ్వూరు, రంపచోడవరం ఉన్నాయి. ఈ సీట్లలో ఇప్పటికే ఆశావాహులు పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు. అమలాపురం సీటు జనసేన ఖాతాలో పడితే ఆ సీటును ఆశిస్తున్న మాజీ ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు పి.గన్నవరం సీటును కోరే అవకాశం ఉంది. ప్రత్తిపాడులో ఇప్పటికే వరుపుల రాజా భార్య సత్యప్రభ చురుగ్గా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించే బలమైన వర్గం కూడా కనిపిస్తోంది. ఇక రామచంద్రపురం సీటు కోసం ఆశావాహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. దీంతో జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ అభ్యర్థులు పోటీ చేసే స్థానాల వ్యవహారం ఒక కొలిక్కి రావడంతో నోటిఫికేషన్‌కు ముందే అభ్యర్థులను కూడా ఖరారు చేసుకున్నారు.

సిఎఎ రాజ్యాంగ విరుద్ధం

బిజెపి సర్కారుపై పలువురి విమర్శ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎను మళ్లీ తెరపైకి తెచ్చింది. 2019 డిసెంబర్ 11న పార్లమెంటులో అప్రజాస్వామికంగా బిల్లును ఆమోదింపజేసుకుంది. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. దేశవ్యాప్తంగా ముస్లిములు వారికి మద్దతుగా ప్రగతిశీల శక్తులు నిరసనలను చేపట్టాయి. దీంతో వెనక్కి తగ్గిన బిజెపి ప్రభుత్వం నాలుగేళ్ల అనంతరం దీన్ని మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ప్రజల మధ్య చిచ్చురేపేందుకే మళ్లీ దీన్ని తెరపైకి తెచ్చిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మతోన్మాద బిజెపి ప్రభుత్వంతో అంటకాగుతున్న టిడిపి, జనసేనలపై అసహనం వ్యక్తం చేస్తున్నాయి. సిఎఎ చట్టాన్ని అధికార వైసిపితో సహా టిడిపి, జనసేనలు కూడా వ్యతిరేకించాలని ముస్లిములు, ప్రజాస్వామ్య వాదులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరిస్తున్నారు. ఈ అప్రజాస్వామికమైన రాజ్యాంగ విరుద్ధంగా చేపట్టిన సిఎఎ చట్టాన్ని రద్దు చేయాలంటున్న వారి మనోభావాలు వారి మాటల్లోనే...

దురుద్దేశపూర్వకంగా తీసుకొచ్చారు



ఇది సరైన యాక్ట్ కాదు. దురుద్దేశ పూర్వకంగానే ఒక మతంపై వివక్షత చూపుతూ, ఆ మతానికి వ్యతిరేకంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. మతపరమైన సిటిజన్ షిప్ ఇవ్వాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. కేంద్రం తీసుకొచ్చిన ఈ నోటిఫికేషన్‌పై మళ్లీ ఉద్యమాలు దేశవ్యాప్తంగా మొదలయ్యే అవకాశం ఉంది. చట్ట ప్రకారం దీనిని ఎదుర్కోవడానికి కృషి చేస్తాం. మతతత్వ పార్టీ అయిన బిజెపితో ఈ రాష్ట్రంలోని టిడిపి, జనసేన జత కట్టడం సరైంది కాదు. దీన్ని ముస్లిం పెద్దలంతా వ్యతిరేకిస్తున్నారు. ఈ రాష్ట్రంలో టిడిపిలోనూ, జనసేన లోను కూడా ముస్లింలు కార్యకర్తలుగా ఉన్నారు. వారి మనోభావాలను గౌరవించి టిడిపి, జనసేన పార్టీలు కూడా సిఎఎను వ్యతిరేకించాలి. ప్రభుత్వం కూడా సిఎఎను వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఎస్.ఏజాజుద్దీన్, అడ్వకేట్, జామియా మస్జీద్ అధ్యక్షుడు, కాకినాడ



ఓట్ల కోసం బిజెపి చేస్తున్న కుట్ర



ఓట్ల కోసం బిజెపి చేస్తున్న కుట్ర

సమాజంలో విద్వేషపూరిత చర్చ జరగాలని తద్వారా వేర్పాటువాద శక్తులను రెచ్చ గొట్టి రానున్న ఎన్నికల్లో ఓట్లు, సీట్లు పొందాలని బిజెపి చేస్తున్న కుట్ర ఇది. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ ఇతర దేశాల నుంచి స్వాతంత్ర్యం ముందు నుంచీ ఉన్న వారికి మన దేశంలో పౌరసత్వం ఇవ్వడానికి పెట్టిన చట్టానికి మతం రంగు పూయడం రాజ్యాంగ విరుద్ధం. టిడిపి, జనసేన, వైసిపిలు రాజ్యాంగ విరుద్ధమైన ఈ చట్టాన్ని వ్యతిరేకించాలి. లేదంటే వచ్చే ఎన్నికల్లో ఎదురు దెబ్బ తప్పదు.

- జవహర్ అలీ, ముస్లిం అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు

ప్రతి భారత పౌరుడూ వ్యతిరేకించాలి



ఆక్రమణ దారులను ప్రభుత్వం ఎప్పుడూ ఆహ్వానించడం జరగదు. కాని మతపరమైన కొలమానం అనేది మన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. 1947 తరువాత నుంచి మన దేశంలో మతం, కులం ప్రాంతం ఎన్నడూ ఆధిక్యం చూపకుండా ఉండాలని రాజ్యాంగం పేర్కొంది. అందరూ స్వేచ్ఛగా జీవించే హక్కును కల్పించింది. కానీ మత పరమైన ఆంక్షలతో వలసదారుల నిర్ధారిస్తామంటూ బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన సిఎఎ చట్టాన్ని ప్రతి భారత పౌరుడు వ్యతిరేకించాలి. లేదంటే రానున్న కాలంలో అందరూ కులాల వారీగా పౌరసత్వం నిరూపించుకోవాల్సి ఉంటుంది. ఈ బిల్లుకు ఎవరు మద్దతు ఇచ్చినా వారు దేశ సౌభ్రాతత్వాన్ని సోదర భావాన్ని దెబ్బతీసినట్లే.

- హసన్ షరీఫ్, ముస్లిం ఆలోచనా పరుల వేదిక రాష్ట్ర కో కన్వీనర్

ప్రజల మధ్య చిచ్చు రగిల్చేందుకే...



శాంతియుతంగా జీవిస్తున్న దేశ ప్రజల మధ్య చిచ్చు రగిల్చేందుకు బిజెపి, ఆర్ఎస్ఎస్ తీసుకొచ్చిన చట్టమే సిఎఎ. భవిష్యత్తులో ముస్లింలు, క్రైస్తవులు, దళితులను ఇబ్బందులకు గురి చేయడమే లక్ష్యంగా దీన్ని తీసుకొచ్చారు. ప్రజలకు అపకారం చేసే చట్టాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం మద్దతు తెలపడం శోచనీయం. సిఎఎ చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వం ప్రకటన చేయాలి. ఇప్పటికైనా ప్రజలు మేలుకోవాలి. రానున్న ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి, దానికి మద్దతు ఇచ్చే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పారు. బిజెపికి, దానికి మద్దతిచ్చే పార్టీలకు ఓటు వేస్తే రాబోయే కాలంలో తీవ్ర పరిణామాలను ఎదుర్కొనాల్సి ఉంటుంది.

- నసీరుద్దీన్, జోనల్ అధ్యక్షుడు
అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్

మత ప్రాతిపదిక రాజ్యాంగ విరుద్ధం



భారతదేశం మత రహిత సెక్యులర్ పునాదులపై నిర్మించబడింది. కుల, మత, వర్ణ, వర్గ, భాష, లింగ భేదాలకు అతీతంగా ప్రతి భారతీయుడికీ సమాన హక్కులు కల్పించిన మహోన్నత విలువలు కలిగింది మన భారత రాజ్యాంగం. కానీ సిఎఎ ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రవేశ పెట్టడం రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగ అధికరణ 14,15, మరియు 25లను ఇది ఉల్లంఘిస్తుంది. రాజ్యాంగ ఆత్మ దాని మౌలిక స్వరూపానికి ఇది వ్యతిరేకం. ఒక వ్యక్తికి పౌరసత్వం కల్పించేందుకు మతం ఆధారంగా తీసుకోవడం సహేతుకం కాదు. ఏదేశంలో కూడా ఇలాంటి సంకుచిత చట్టాలు ఉండవు. ఈ బిల్లు అమలైతే పేద దళిత ముస్లిం వర్గాలకు చెందిన వారు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి అవసరమైన పత్రాలు సమర్పించడానికి వ్యయప్రయాసలకు గురికాక తప్పదు.

- కలీముల్లాఖాన్,
రాష్ట్ర అధ్యక్షులు, ఐడియల్ యూత్ మూమెంట్, ఆంధ్రప్రదేశ్



గ్రామాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - తాళ్లపూడి


గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ అన్నారు. మండలంలోని అన్నదేవరపేట ఎస్‌సి కాలనీలో రూ.35లక్షల జడ్‌పి నిధులతో నిర్మించనున్న సిసి రోడ్లు ఇతర అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ కొత్తగా మంజూరైన నిధులే కాకుండా గతంలో సుమారు రూ.40 లక్షల జడ్‌పి నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలిపే సుధారాణి, ఉపసర్పంచ్ నాగ మాధవి, ఎంపిటిసి సభ్యులు నూతంగి కుమారి, వైసిపి జిల్లా నాయకులు పోసిన శ్రీకృష్ణదేవరాయలు, పిట్ట శ్రీను నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నాని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - పెరవలి

రానున్న ఎన్నికల నేపథ్యంలో సిఐ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు మండలంలోని పిట్టల వేమవరం, కడింపాడు, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, ఖండవల్లి తదితర గ్రామాల్లో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్ఐ ఎజిఎస్.మూర్తి ఆధ్వర్యంలో సుమారు 60 మంది సి ఆర్ పి ఎఫ్ జవాన్లు, పోలీసులు ఈ కవాతులో పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఎస్‌పి పి.జగదీష్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, డిటిసి కెవి.కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరక్కుండా తీసుకోవాల్సిన చర్యలపై సంభందిత శాఖల అధికారులు ప్రణాళికా సిద్ధం చేసుకుని ఆచరణలోకి తీసుకురావాలన్నారు. బ్లాక్ స్పాట్లలో ప్రతిపాదించిన పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం తగదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు రహదారి ప్రమాదాలు జరుగకుండా కచ్చితమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రతా సమావేశాల్లో సూచించిన అంశాలను ప్రాధాన్యతగా భావించి నెల రోజుల్లో పూర్తిచేయాలన్నారు. రోడ్ కం రైల్ బ్రిడ్జికి రెండు వైపులా సిసి కెమెరాలు ఏర్పాటు చేసి, నిఘా పెంచాలన్నారు. అనుమతి లేని వాహనాల రాకపోకలు నియంత్రించాలనీ స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఎస్‌పి కె.రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ బ్లాక్ స్పాట్‌లను ఇప్పటికే గుర్తించామన్నారు. ఆయా ప్రదేశాల్లో ప్రమాద హెచ్చరికల సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారుల్లో హైవే పెట్రోలింగ్ వాహనాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రెండేళ్లతో పోల్చితే రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. హిట్ అండ్ రన్‌కి సంబంధించి గాయ పడిన వారికి రూ. 50 వేలు, మరణించిన వారికి రూ.2 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల పీడీ సురేంద్రనాథ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

జీతాల సమస్య పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీతాల సమస్యను పరిష్కరించాలని యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.జయకర్ మాట్లాడారు. ఉపాధ్యాయులకు మూడు నెలలుగా వేతనాలు అందలేదన్నారు. ఈ సమస్యకు పూర్తి బాధ్యత అధికారులదేనన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణకుమారి మాట్లాడుతూ అధికారుల అలసత్వం వల్ల ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక పరమైన ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోసం యుటిఎఫ్ రెండు నెలలుగా కృషి చేస్తుందన్నారు. ఉన్నతాధికారుల అలసత్వం వల్ల ఈ సమస్య నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే జీతాలు విడుదల చేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్ రావు మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి అధికారులపై ఒత్తిడి తేవాలన్నారు. యుటిఎఫ్ నగర శాఖ అధ్యక్షులు అప్పారావు మాట్లాడుతూ డిఐ ఉపాధ్యాయుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఆయన ప్రవర్తనను మార్చుకోవాలన్నారు. రాష్ట్ర అధ్యక్షులు నక్క. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అవసరమైతే రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేస్తామని తెలిపారు. అనంతరం డిఎస్ఇఒ యుటిఎఫ్ నాయకులతో చర్చలు జరిపారు. జీతాలు సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ మేరకు రాతపూర్వక హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.విజయగౌరి, కార్యదర్శులు ఎన్.రవిబాబు, ఎం.రమేష్‌బాబు, దయానిధి, కెవిఎస్.ప్రకాశరావు, ఎం.శ్రీనివాస్, ఆయా ప్రాంతాల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న అరుణకుమారి

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల నాయకులు వైసిపి జెండాలను ఆవిష్కరించారు. వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజమహేంద్రవరం ఎంపీ కార్యాలయంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. అడపా శ్రీహరి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి ప్రతి నాయకుడూ, కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీ సీనియర్ నేత నక్కా శ్రీనగేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 151 అసెంబ్లీ స్థానాలు, 22 లోక్‌సభ స్థానాలను కైవశం చేసుకుందంటే ఇది నిజంగా సంచలన రికార్డు అన్నారు. ఈ కార్యక్రమంలో పాలిక శ్రీను, గుర్రం గౌతమ్, ఉమా, ఎం.అవినాష్, మహ్మద్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** మండలంలోని రంపఎర్రంపాలెంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవి సెంటర్, దళితకాలనీ, పెంటపల్లిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పాటి రాంబాబు, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు కర్రి శివరామకృష్ణ, ఉపసర్పంచ్ దాకారపు ధర్మరాజు, మాజీ సర్పంచ్ తొట్ట సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ పాటి అప్పలరాజు, సచివాలయం కన్వీనర్ దంగేటి వెంకటరత్నం, ఎంపిటిసి గండికోట రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలంలోని పెద్దేవంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, నాయకులు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ వైస్ ప్రెసిడెంట్ బట్టు సుబ్బారావు, నాయకులు కోడి గంగారావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న శ్రీహరి, రావిపాటి

జెసి ఆధ్వర్యంలో ఎన్నికల శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్ సమావేశ మందిరంలో జెసి ఎన్.తేజ్ భరత్ సమక్షంలో ఎన్నికలపై శిక్షణను మంగళవారం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ సెక్టార్ అధికారులు, పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్స్, ఇతర ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, పోలింగ్ కేంద్రాల నుంచిబ్యాలెట్ యూనిట్స్ పనితీరు, ఓటింగు పూర్తి అయిన తరువాత రిసెప్షన్ కేంద్రాలకు తరలింపు వంచి విధులపై అవగాహన కల్పించారు. ఏ చిన్న పొరపాటు జరిగినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ సాయిబాబు, తహాశీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణా సమావేశానికి హాజరైన సిబ్బంది



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ తలారి

సేవా కార్యక్రమాలు అభినందనీయం


ప్రజాశక్తి - తాళ్లపూడి

వైద్య శిబిరాలతో పాటు, ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో ఆర్యవైశ్య సంఘంతో పాటు మరి కొన్ని సేవా సంస్థలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని వైసిపి కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. తాళ్లపూడి ఆర్యవైశ్య సంఘం మరికొన్ని సేవా సంస్థలు సంయుక్తంగా ఈనెల 16న తాళ్లపూడిలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సంబంధించిన గోడ పత్రికను ఎంఎల్ఎ తలారి మలకపల్లి కుంటముక్కల కేశవ నారాయణ ఇంటి వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు.

జగన్‌తో సొంతింటి కల సాకారం

ప్రజాశక్తి-కడియం

రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు సొంతి కలను ముఖ్యమంత్రి సాకారం చేశారని ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ గిరజాల రామకృష్ణతులసి అన్నారు. కడియం గిరజాల కృష్ణప్రసాద్ కళ్యాణమండపంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను 438 మందికి స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సొంత గూడును కల్పించడమే లక్ష్యంగా సిఎం పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, ఆర్ఎస్ఎన్.మూర్తి, సాకా పట్టాభి, దొడ్డా బుజ్జి, కుసునూరి బాబులు, గుత్తుల వాసు, సర్కార్ భాష, పున్నమ రాజు వీర్రాజు, దాసరి నాగేంద్ర, దంగుడు బియ్యం సుబ్బారావు, పూడి వీరబ్రహ్మం, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జోడాల

ప్రణాళికతో పరీక్షల్లో విజయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి విద్యార్థి పరీక్షల్లో విజయం సాధించడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని తహాశీల్దార్ గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గజ్జరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు వెంకటేశ్వరరావు మంగళవారం అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలనె ఎలా ఎదుర్కొనాలో వివరించారు. హెచ్‌ఎం మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను తీర్చడానికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో మరో సేవా సంస్థ నందన ఫౌండేషన్ ప్రతినిధి రవి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 269 మంది హాజరు

ప్రజాశక్తి- చాగల్లు

చాగల్లు శ్రీ వెలగపూడి రామకష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 270మంది విద్యార్థులకు 269 మంది విద్యార్థులు హాజరయ్యారనిప్రిన్సిపల్ పావని తెలిపారు. ఒక విద్యార్థి గైర్హాజరయ్యారన్నారు.

అభివృద్ధిని ఓర్వలేక తప్పుడు ప్రచారం

ఐటి శాఖ మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - రాజానగరం

వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఐటి శాఖ మంత్రి అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని కలవచర్లలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థకు సంబంధించిన రూ.20.65 కోట్లతో నూతన పారిశ్రామిక వాడ పనులకు ఆయన మంగళవారం భూమి పూజ చేశారు. తొలుత వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి అమర్నాథ్ మాట్లాడారు. కలవచర్లలో సుమారు ఐదు వేలు ఇండస్ట్రీస్ వస్తాయన్నారు. దీని వల్ల పరిసర గ్రామాల్లో యువతకు ఉపాధి,


ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తున్నమంత్రి అమర్‌నాథ్

ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అడుగుతుంటే, పొత్తు ఉన్నాయని కాబట్టి ఓటు వేయాలంటూ చంద్రబాబు అడగడం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గంలో గ్లాస్ గుర్తు ఓటు వేయాలని, పార్లమెంటు నియోజకవర్గంలో పువ్వు గుర్తుకు ఓటు వేయాలని మాట్లాడే వారిని తరిమి కొట్టాలన్నారు. జోనల్ మేనేజర్ రమణారెడ్డి మాట్లాడుతూ ఈ పారిశ్రామిక వాడ సుమారు 104 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నామనానరు. ఐదు వేల మందికి ప్లాట్స్ కేటాయిస్తామన్నారు. రోడ్డు, డ్రెయినేజీ ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్, జడ్‌పిటిసి సభ్యులు వాసంశెట్టి పెద్ద, మండల కన్వీనర్ దూలం పెద్ద, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, మాజీ సర్పంచ్ సంగీతం అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పంటబోదెలో మృతదేహం

ప్రజాశక్తి - కాజులూరు

పంట బోధిలో గుర్తు తెలియని మృతదేహం లభించిందని ఎస్ఐ ఎస్.తులసీరామ్ తెలిపారు. మంగళవారం కోలంక నుంచి చలివేంద్రపాడు రహదారిలో బ్రాందీ షాప్ సమీపంలో పంట బోధిలో గుర్తు తెలియనీ మృతదేహం ఉందని రెవిన్యూ అధికారి సుబ్రహ్మణ్యం ఇచ్చిన సమాచారంతో సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. మృతుడు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని అన్నారు. సంఘటన ప్రాంతాన్ని సిఐ శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వేధింపుల కేసులో ఏడేళ్ల జైలుశిక్ష

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట మండలానికి చెందిన బాలికపై వేధింపులు కేసులో నిందితుడు చప్పిడి అర్జున్ కు పోక్సో కోర్టు(కాకినాడ)7 సంవత్సరాలు జైలు శిక్ష రూ.11 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పినట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు. ఎస్ఐ చెప్పిన వివరాలు ప్రకారం.. 2020 జూలై 2 న బాలికను వేధిస్తూ ఫొటోలు మార్ఫింగ్ చేసి ప్రేమిస్తున్నానని వేధిస్తూ చంపుతానని బెదిరించినట్లు నిందితుడు అర్జున్‌పై అప్పటి ఎస్ఐ ఎస్.కె.జానీ భాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడుని రిమాండ్ కు పంపించారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ పర్యవేక్షణలో కాకినాడ కోర్టులో ట్రయిల్ జరపగా పిపి పితాని శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్ తరుపున వాదనలు వినిపించారు వాదోపవాదనలు అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి ఎల్..వెంకటేశ్వరరావు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్ఐ తెలిపారు. చిన్నపిల్లలపైన, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేసు దర్యాప్తులో కషి చేసిన అప్పటి ఎస్ఐ జానీ భాషా, సిబ్బంది ని ఎస్పి ఎస్. శ్రీధర్ అభినందించారు.

గోల్డ్ చైన్ రికవరీ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

చోరీ కేసులో బంగారం చైన్ ను రికవరీ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించామని ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇవి.. మండలం లోని కొత్తలంక గ్రామానికి చెందిన కోళ్ల సత్యవతి గత నెల 28న పని మీద వేరే ఊరు వెళ్లి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు బందరు పాలెం వద్ద వేచి ఉంది. ఈసమయంలో ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్ పై వచ్చి ఆమె మెడలో రెండు కాసుల బంగారు చైను లాక్కొని పారిపోయారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ముమ్మిడివరం ల్యాంప్ కళాశాల వద్ద గల వై జంక్షన్ వద్ద వాహనాల చెక్కింగ్ నిర్వహిస్తుండగా నిందితులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పొన్నమండ సుబ్బరాజు, గాడి శివ నాగరాజు లను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి చోరీ చేసిన బంగారు వస్తువులను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

స్కూల్ బస్సు ఢీకొనడంతో వ్యక్తి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రయివేటు స్కూల్ బస్ ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గోపాలపురం బిసి కాలనీకి చెందిన చింతపల్లి రాంబాబు పరమేశ్వర బయోటెక్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం యథావిధిగా ద్విచక్ర వాహనంపై కంపెనీకి బయలుదేరాడు. గోపాలపురం శివారు గుడ్డిగూడెం రోడ్డు వద్ద ఉన్న దుర్గమ్మ తల్లి గుడి వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి స్కూల్ బస్సు వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రాంబాబు కుడికాలు నుజ్జునుజ్జయ్యింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. బాధితుని రాజమహేంద్రవరంలో ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని జేగురుపాడులో సారా విక్రయ దుకాణాలపై కడియం సిఐ బి.తులసీధర్ ఆధ్వ ర్యంలో ఎస్ఐ టి.కృష్ణసాయి సిబ్బందితో మంగళవారం దాడులు నిర్వహించారు. గ్రామంలో సారా అమ్ముతున్న నిచ్చెనకోళ్ల వెంకట రమణను అరెస్టు చేశారు. అతని నుంచి 10 లీటర్లు సాంను స్వాదీనం చేసుకున్నా మన్నారు. నిందితురాలిని అరెస్టు చేశామని తెలిపారు. కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరిచామన్నారు.



ప్రయివేటు స్కూల్ బస్సు బోల్తా

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక పంచాయతి పరిధిలో వెంకాయమ్మ పేట గ్రామంలో మంగళవారం ఉదయం విద్యార్థులతో వెళ్తున్న ప్రయివేటు స్కూల్ బస్సు అదుపుతప్పి నర్సరీ మొక్కల్లో బోల్తాపడింది. వెంటనే స్థానికు స్పందించి బస్సు అద్దాలు పగులగొట్టి విద్యార్థులను బయటకు తీశారు. ఇరువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి గల కారణం తెలియాల్సి ఉంది. ప్రమాద సమయంలో బస్సులో 15 మంది విద్యార్థులు ఉన్నారని స్థానికులుత ఎలిపారు. ప్రమాదానికి గురైన బస్సును సంఘటనా స్థలం నుంచి హడావుడిగా స్కూల్ యాజమాన్యం తరలించింది.

ఎన్నికల కోడ్ తప్పక పాటించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్


సమావేశంలో మాట్లాడుతున్న సహాయ రిటర్నింగ్ అధికారి సాయిబాబా

ఎలక్షన్ కమిషన్ నిర్దేశించిన నియమావళిని, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా పాత్రికేయులు కచ్చితంగా పాటించాల్సి ఉంటుందని రాజమండ్రి రూరల్ సహాయ రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబా పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నిల్లో పొలిటికల్ పార్టీలు, మీడియా పాత్రపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమాచార ప్రజలకి చేర్చడంలో మీడియా బాధ్యత కీలకమన్నారు. అవగాహన కల్పించి సందేహాలు నివృత్తి చేసుకుని వచ్చే సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగానికి మీడియా సహకరించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సజావుగా జరగడానికి తీసుకున్న ఏర్పాట్లను వివరించారు. ఎన్నికల సమయంలో వాస్తవాలను మాత్రమే ప్రచురించాలని కోరారు. అసత్యమైన కథనాలు వల్ల ఇబ్బందికర పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. వాటికీ సంబందించి వివరణలను కచ్చితంగా ప్రజలకు, ఓటర్లకు చేరవేయాల్సి ఉంటుం దన్నారు. ప్రజల మధ్య విద్వేషాన్ని పెంచే వార్తలను రిపోర్టింగ్ చేయకూ డదని స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో తహశీల్దార్లు వైవి.అప్పారావు, వి.రమాదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సిహెచ్.నరేష్, టి.విష్ణుమూర్తి, బి.మురళీధర్, కె.రామకృష్ణ, పి.రామకృష్ణ, వి.కొండలరావు, జగదీష్‌బాబు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ మాధవీలత

ఓటింగ్ శాతం పెంపునకు చర్యలు

ప్రజాశక్తి - రాజానగరం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపునకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులను ఆదేశించారు. తక్కువ ఓట్లు నమోదైన గ్రామాలు గుర్తించి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో తూర్పుగోనెగూడెం ఎంపిపి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పోలింగ్ కేంద్రాలను ఎస్‌పి పి.జగదీష్‌తో ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కమిషన్ 2024 సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనుందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేలా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక స్వీప్ కార్యకలాపాలను చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఒక్క ఓటరూ తప్పకుండా పోలింగ్ కేంద్రాలకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. అందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు ఆమె వెంట ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి, తహశీల్దార్ అబ్దుల్ రెహ్మాన్, బిఎల్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్

జాబ్‌ఫెస్ట్‌కు 750 మంది హాజరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌ఫెస్ట్‌కు 750 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్ట్స్ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఏపిఎస్ఎస్‌డిసి నోడల్ రిసోర్స్ సెంటర్, నిర్మాణ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఫెస్ట్‌ను నిర్వహించారు. బ్యాంకింగ్, లాజిస్టిక్స్, ఫార్మసీ, ఐటి తదితర 24 కంపెనీలు ఈ జాబ్ ఫెస్ట్‌లో పాల్గొన్నాయి. ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఈ ఫెస్ట్‌న ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థులు పట్టాతో పాటుగా ఉద్యోగ నియామకపత్రంలో బయటకు వెళ్లాలనే కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ఫెస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కళాశాల ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఏర్పాటు చేసిన జాబ్ పోర్టల్(CEJP)లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల విద్యార్థులకు తమ భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాల గురించి తెలుసుకోవడానికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి జోన్ 1, 2 విభాగాల కళాశాల విద్యాశాఖ ఆర్‌జెడి శోభారాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ కో-ఆర్డినేటర్ శ్రీధర్, జెకెసి కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్‌రెడ్డి, ఎన్‌ఆర్‌సి కో-ఆర్డినేటర్ సిహెచ్.సంజీవ్, ఎకాడమిక్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సంజీవ్, వైస్ ప్రిన్సిపల్ ఎస్.శాస్త్రి, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ జాబ్ ఫెస్ట్‌లో 269 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఎన్‌ఆర్‌సి కో-ఆర్డినేటర్ తెలిపారు.

కృష్ణునిపాలెంలో తోట వాణి ప్రచారం

ప్రజాశక్తి-గోకవరం



ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాజీ మంత్రి జగ్గంపేట వైసీపీ ఇంచార్జి తోట నరసింహం సతీమణి తోట వాణి, శ్రీనిధి రాంజీ మండలములోని కృష్ణుని పాలెం గ్రామంలో కొత్తూరు, గ్రామాల్లో గడపగడపకు ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి 14వ వార్షికోత్సవ వేడుకలు లో భాగంగా గోకవరం పాత బస్టాండ్ వద్ద గల వైఎస్ఆర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి కేక్ కట్ చేసి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కొత్తూరు గ్రామంలో వైఎస్ఆర్సిపి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ గ్రామస్తుల అందరు సహకారంతో రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి పార్టీని గెలిపించి తోట నరసింహం ను స్థానిక ఎమ్మెల్యే చేయడంతో పాటు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని ఆమె గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి భర్త వీరబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు, గ్రామ సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి,భర్త జోగేశ్వరరావు, సొసైటీ చైర్ పర్సన్ దాసరి చిన్నబాబు,మండల వైసీపీ అధ్యక్షులు పాటి. రాంబాబు, ఎస్సీ సెల్ జోనల్ ఇంచార్జ్ గుల్లా ఏడుకొండలు, వైకాపా ఎస్సీ సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్, నరాల శెట్టి నరసయ్య, కర్రి సూరారెడ్డి, బదిరెడ్డి నాగేశ్వరరావు, వేర్ల వెంకటేశ్వర్లు, అంబటి ప్రసన్న, సమ్మేటి నాని, కమ్మిలి అచ్చిబాబు, బదిరెడ్డి సుబ్బారాయుడు, బత్తుల శీను, సీంబోతుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పలివెల పాదయాత్ర

ప్రజాశక్తి - సీతానగరం

సిపిఐ ఎంఎల్ పార్టీ ఇండిపెండెంట్ అభ్యర్థి పలివెల వీరబాబు గత కొన్ని నెలలుగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇంటింటికి పలివెల పాదయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పార్టీ నాయకులు సిపిఐ ఎంఎల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పలివెల వీరబాబు పాదయాత్రలో భాగంగా మంగళవారం రఘుదేవపురం, సింగవరం, వంగలపూడి గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పాదయాత్రను కొనసాగిస్తున్నారు. రాబోయే రోజుల్లో పార్టీ సిద్ధాంతాలు పేద ప్రజల కోసమేనని నియోజకవర్గంలో పేద ప్రజలకు రావలసిన అనేక సంక్షేమ పథకాలు అందటం లేదన్నారు. మా పార్టీ వచ్చినట్లయితే ప్రతి పేదవాడు జీవితం అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.



అఖిలపక్షం సూచనలు పరిగణనలోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ


ఎస్‌పి సతీస్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్షం ప్రతినిధులు

కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ ఏర్పాటు చేయాలనే దానిప అఖిలపక్షం చేస్తున్న సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని అఖిల పక్షం నాయకులు కోరారు. మంగళవారం ఎస్‌పి ఎన్.సతీష్ కుమార్‌ను అఖిలపక్షం నాయకులు కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన హక్కు ప్రదేశం నిర్ణయం చేయాలని ఏకగ్రీవ తీర్మానం ప్రతిని అందజేశారు. ఈ సందర్భం గా అఖిలపక్ష బృందం నాయకులు మాట్లాడుతూ ప్రజల తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు, రాజ్యాంగం కల్పించిన హక్కును కాపాడుకునేందుకు కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌ను ఉంచా లని అన్నారు. సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు దీక్షతో కలెక్టర్ స్పందించి అఖిలపక్షంతో చర్చలకు ఆదేశించారని తెలి పారు. ఆర్‌డిఒ, డిఎస్ పిలు అఖిలపక్షం నాయకులతో చర్చిం చారని, ఆర్‌డిఒ ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు అందించే క్రమంలో పోలీసు శాఖ నుంచి ఇచ్చే నివేదికలో అఖిలపక్షం సూచనలను పరిగణనలోకి తీసుకుని ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ, న్యూడె మోక్రసీ, టిడిపి, కాంగ్రెస్, బిజెపి, జనసేన, ఆమ్‌ఆద్మీ, బిఎస్‌పి, ఆర్‌పిఐ, ఇతర ప్రజా సంఘాల నాయకులు మోర్తా రాజశేఖర్, దూసర్లపూడి రమణరాజు, అయితాబత్తుల రామేశ్వరరావు, దువ్వా శేషబాబ్జీ, తోకల ప్రసాద్, జల్లూరి వెంకటేశ్వర్లు, పప్పు దుర్గా రమేష్, టి.రమణి, చంద్రమళ్ల పద్మావతి, అయినాపురపు సూర్య నారాయణ, గుబ్బల ఆది నారాయణ, సిద్ధాంతుల కొండబాబు, పిట్టా వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులను విడిపించాలి

ప్రజాశక్తి - కాకినాడ

సుధా సతీష్ ఆక్వా ఫామ్‌లో నిర్బంధించి వెట్టి చాకిరి చేయిస్తున్న ఆరుగురు బెంగాల్ కార్మికులను తక్షణం విడిపించి సొంత గ్రామాలకు పంపించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నానికి చెందిన గుర్తుతెలియని ఏజెంట్ ద్వారా పశ్చిమ బెంగాల్ బంకూర జిల్లా ప్రాంతం నుంచి ఆరుగురు వలస కార్మికులను15 రోజుల క్రితం జిల్లాలోని పెదపూడి మండలంలో ఉన్న సుధా సతీష్ ఆక్వా ఫార్మ్‌కు తరలించారని తెలిపారు. వారు వచ్చిన నాటి నుంచి యాజమాన్యం రోజుకు 16 గంటలకుపైబడి పని చేయిస్తుం దన్నారు. వారికి అవసరమైన ఆహారం, వసతి కల్పించడం లేదని, పైగా వారి సెల్‌ఫోన్లను సైతం యాజమాన్యం తమ వద్ద పెట్టు కుని వారితో వెట్టిచాకిరి చేయిస్తుందని విమర్శంచారు.

పలువురు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - సీతానగరం

మంగళవారం ఉండేశ్వరపురంలో గొండేల దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు టిడిపిలో చేరారు. టిడిపి రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణచౌదరి, రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బత్తుల బలరామకృష్ణ వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సీతానగరం మండల వ్యాప్తంగా పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరేందుకు క్యూకడుతున్నారని వారన్నారు. 100 వైసిపి కుటుంబాలు ఉండేశ్వరపురం గ్రామంలో టిడిపిలో చేరడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉండేశ్వరపురం గ్రామ ఒకటవ వార్డ్ మెంబర్ గుండెల హనుమంతు, నాయకులు యర్రమెల్లి అప్పన్న, దొంగర వీరబాబు, బి.నాగబాబు, గొండేల నాగబాబు, గుమ్మళ్ళు గంగాధర్, చేబోలు సత్యనారాయణ, గుమ్మళ్ళు శ్రీను, అబ్బా ఆంజనేయులు, తమ్మిశెట్టి వెంకటేష్, ఎంపిటిసి మాజీ సభ్యులు భేరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వనపర్తి తాతాజీ, భేరి స్వామి నాయుడు, భేరి నాగేశ్వరరావు, భేరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలి : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్నుల బకాయిలపై వడ్డీ మాఫీ అయినందున ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని పన్నులు వెంటనే చెల్లించాలని, తద్వారా నగరాభివృద్ధికి తోడ్పడాలని కమిషనరు కె.దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం పృథ్వీ ఎడిఫైస్ లిమిటెడ్ సంస్థ వారు 2023-2024 సంవత్సరమునకు సంబంధించి సంస్థకు చెల్లించాల్సిన రూ.6.77 లక్షల పన్నుల చెక్‌ను కమిషనర్‌కు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం పాత బకాయిపై ఉన్న వడ్డీని మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. పన్నును చెల్లించిన సంస్థను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమణ, రెవెన్యూ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కెపి.మూర్తి, బిల్లు కలెక్టరు గాంధీ, పరిపాలన కార్యదర్శి వజ్రకాంతి, సంస్థ అధికారులు పాల్గొన్నారు.